క్లుప్తంగా

21 నుంచి గ్రామదేవత ఉత్సవాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న జెడ్పీటీసీ, కమిటీ సభ్యులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని కొండపాలెంలో కొలువైన మరిడమ్మతల్లి, బంగారమ్మతల్లి, పైడితల్లమ్మ గ్రామదేవత పండగ మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావుతో కలిసి కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవార్ల జాతర మహోత్సవాలను ఈ నెల 21, 22, 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆయా రోజుల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ సతీష్, తదితరులు

వేపాడ: మండలంలోని చామలాపల్లి పంచాయతీ పరిధి పోతుబందిపాలెంకు చెందిన గిరిజన క్రీడాకారులకు గ్రామ సర్పంచ్ కోలా సతీష్ శుక్రవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత యువత చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని, పంచాయతీకి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటసూరి, తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలి



హౌసింగ్ డే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, లబ్ధిదారులు

వేపాడ: హౌసింగ్ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి, గృహప్రవేశాలకు సిద్ధం కావాలని హౌసింగ్ ఏఈ అప్పలనాయుడు కోరారు. నల్లబిల్లి జగనన్న లేఅవుట్లో శుక్రవారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ అధికారులు ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. బిల్లులు సకాలంలో అందిస్తామని, నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులు ఉంటే ఐకేపీ ద్వారా రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, సచివాలయ ఇంజినీర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

న్యాయం కోసం..



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దళిత మహాజన సభ నేతలు

జామి: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన దళిత యువకుడు బసువు స్వామినాయుడు మార్చి 20న ఆటో ఢీకొని మృతిచెందిన విషయం విదితమే. మృతికి కారకుడైన ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేయాలని, మృతుని కుటుంబానికి పరిహారం అందించి న్యాయం చేయాలని దళిత మహాజన సభ జిల్లా అధ్యక్షుడు గంటాన అప్పారావు, జిల్లా నాయకులు ఆతవ ఉదయ్‌భాస్కర్, పత్రి అప్పారావు, బీఎస్పీ నేత గాలి చైతన్యకుమార్, తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. మృతికి కారకులైనవారిని శిక్షించాలని, లేదంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు



శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణంలోని కుమ్మరికాలనీలో ఉన్న శ్మశానవాటికలో బోరు ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.1.25 లక్షలు ఎంపీపీ గ్రాంట్ నిధులతో బోరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కుమ్మరికాలనీ శ్మశానవాటికకు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతుండేవారని, ఎంపీ నిధులతో రహదారి నిర్మాణంతో పాటు శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గిరిడ రాందాసు, మంగళగిరి శ్రీను, కరణపు ఆది, సూరు దుర్గారావు, ఒమ్మి రమేష్, సూరు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నాడు-నేడు' కింద నిర్మిస్తున్న నూతన భవనాల నిర్మాణ పనులను హెచ్ఎం వల్లి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయ శుక్రవారం పరిశీలించారు. విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. వారి వెంట సీఆర్పీ లక్ష్మి ఉన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే 'గడపగడపకు..'

- ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య



లబ్ధిదారులకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం వివిధ పథకాలు ద్వారా అందించిన లబ్ధిని తెలియజేయడంతో పాటు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. వింధ్యవాసి గ్రామంలో సర్పంచ్ సర్పంచ్ రంభ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలును వివరించారు. గ్రామస్తులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అర్హులకు పథకాలు అందేవి కావని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులన గుర్తించి వారి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరవేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఇళ్లు మంజూరు చేయాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేను కోరడంతో వెంటనే మంజూరు చేశారు. పనులు చేపట్టిన వెంటనే బిల్లులు మంజూరు చేయాలని ఏఈ శ్రీనివాస్‌కు ఆదేశించారు. గ్రామంలో 200 మీటర్లు సీసీ రోడ్డు కావాలని గ్రామస్తులు కోరగా.. రెండు రోజుల్లో నిధులు మంజూరు చేస్తానని, వెంటనే పనులు చేపట్టాలని సర్పంచ్‌కు సూచించారు. వీఆర్వో రైతులకు తెలియ కుండా భూముల రికార్డులను ఇష్టానుసారంగా మారుస్తున్నారని మాజీ సర్పంచ్ ఉరిటి అప్పలనాయుడు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను, గ్రామ పెద్దలు మరడ అప్పలనాయుడు, చంటి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. వల్లంపూడిలో శుక్రవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. మీకు మంచి జరిగిందని అనిపిస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి, వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఎంపీటీసీ శానాపతి లక్ష్మి, ఉపసర్పంచ్ రుద్ర వెంకటరావు, ఏఎంసీ చైర్మన్ మూకల కస్తూరి, నెడ్‌క్యాప్ డైరెక్టరు పద్మావతి, పంచాయతీరాజ్ రీజనల్ కన్వీనర్ మెరపల సత్యనారాయణ, మండల కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ ఈర్లి సన్యాసినాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు సీఎం సందేశ పత్రాన్ని అందజేస్తున్న నాయకులు, అధికారులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకుంటోందని ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు అన్నారు. గరివిడి మండలం దువ్వాం గ్రామంలో శుక్రవారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకు పాలన తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పుడైనా అమలు జరిగాయా అని ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి టీడీపీ నేతలు ఓర్వలేక ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తోట స్వాతి, ఎంపీటీసీ నేతేటి కృష్ణవేణి, తోట రవికుమార్, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములునాయుడు, ఎలకల అప్పలనాయుడు, గుడివాడ తమ్మినాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేతలకు నగదు బహూకరణ



నగదు బహుమతి అందుకుంటున్న విజేత జట్టు సభ్యులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని శేరీపేట గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంటులో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు. రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గ్రామానికి చెందిన పొట్నూరు రాజేష్ జ్ఞాపకార్థం గ్రామ యువత, గ్రామపెద్దలు ఈ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతగా విజయనగరం జట్టు, రన్నర్‌గా గరివిడి, తృతీయ స్థానంలో ఎంవీజీఆర్ కాలేజీ, నాల్గో స్థానంలో శేరిపేట జట్లు నిలిచాయి. విజేతలకు రూ.10 వేలు, రెండు, మూడు, నాలుగో స్థానంలో నిలిచిన జట్లకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పీడీలు జి.అప్పారావు, కె.హరిబాబు, గ్రామపెద్దలు పిల్ల అప్పారావు, పిల్ల ఆదినారాయణ, జమ్ము ఆదినారాయణ, గొరజాన రమణ, జమ్ము కృష్ణ, పెద్ద గురువులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సేవలను వినియోగించుకోండి



కొత్తవలస: మాట్లాడుతున్న చైర్మన్ విరోతి కొండలరావు



ఎల్.కోట సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు

కొత్తవలస: రైతుభరోసా కేంద్రాల్లో సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ విరోతి కొండలరావు అన్నారు. కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి సచివాలయం -1లో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, రైతుభరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయశాఖకు సంబంధించిన అన్ని సేవలను అందిస్తోందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకొని మేలైన పంటలు పండించాలని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన కొత్తవలస ప్రాంతీయ వ్యవసాయ సంచాలకులు ఎల్.విజయ మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్‌బీకేల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు, జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను రాయితీపై అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి మాధురీ శరణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్.కోట మండలంలో..

ఎల్.కోట మండల పరిషత్ భవనంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సి.హెచ్.మాధవరావు అధ్యక్షతన సలహా మండలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అవసరమైన అన్ని రకాల విత్తనాలు సమకూర్చాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఎ.స్వాతికుమారి తదితరులు పాల్గొన్నారు.

104 సిబ్బంది నిరసన

జామి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది శుక్రవారం నిరసన తెలియజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉదయం నల్ల బ్యాడ్జీలు ధరించి, మధ్యాహ్నం ఖాళీ కంచాలతో నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమంలో 104 డీఈఓ ఆర్.సన్యాసినాయుడు, పైలట్ ఎం.కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

గజపతినగరం: కోమటిపల్లి, చల్లపేట రూరల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు డీఈ శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నోట్‌బుక్స్ వితరణ



క్రీడాకారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న దాతలు

శృంగవరపుకోట: మండలంలో ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు గ్రామానికి చెందిన కేశవ, గోవింద శుక్రవారం పెన్నులు, పుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేశారు. తమ సోదరుడు జానా శ్రీనివాసరావు జ్ఞాపకార్థం వాటిని పంపిణీ చేసినట్లు చెప్పారు. మొత్తం 75 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకురాలు పొట్టా కల్యాణి, కోచ్‌లు హారిక, పి.మౌనిక పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో రైతుల వివరాలు



మాట్లాడుతున్న ఏఓ మల్లికార్జునరావు

బొండపల్లి: రైతుభరోసా పొందేందుకు అర్హులైన రైతుల వివరాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి పి.వి.మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని గరుడుబిల్లిలోని రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆ జాబితాలో ఉన్న వివరాలను పరిశీలించుకుని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 20లోగా తెలియజేయాలని కోరారు. అలాగే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి ఎ.రాజశేఖర్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోద్దల చిన్నంనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎర్రినాయుడు, ఏఈఓ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు వేగవంతం చేయాలి

- జేసీ మయూర్ అశోక్



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్



గుర్ల: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, సొసైటీ అధికారులు

జామి: త్వరితగతిన మొక్కజొన్న కొనుగోలు చేపట్టాలని జేసీ మయూర్ అశోక్ అన్నారు. మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో శ్రమశక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు జరిపిన కొనుగోళ్లు, కేంద్రం నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. మొక్కజొన్న బస్తాలకు టాగింగ్ విధానాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రోజుకు 100 టన్నులు చొప్పున పంట కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. జేసీతో పాటు మార్క్‌ఫెడ్ డీఎం విమల, తహసీల్దార్ హేమంత్‌కుమార్, వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

గుర్ల: మండలంలోని నడుపూరు రైతుభరోసా కేంద్రం వద్ద మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు పంటను అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో గూడేం సొసైటీ అధ్యక్షుడు రెడ్డి మురళి, బెల్లాన బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు

బొండపల్లి: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు మీసాల తులసీరాం అన్నారు. శుక్రవారం గొట్లాం గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి డ్వాక్రా మహిళలకు గత మూడేళ్లలో చేపట్టిన సంక్షేమాన్ని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా కింద మూడు విడతల్లో ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. మహిళలు జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు సీసీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

- ఎంపీపీ హైమావతి



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: విత్తనాలు పరీక్షించిన మీదట రైతులకు అందించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులకు సాగుచేయడం తప్ప మరే విషయం పెద్దగా తెలియదని, కాబట్టి రైతులు నష్టపోకుండా వారికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించాలని చెప్పారు. భూసారం తగ్గిపోకుండా పచ్చిరొట్ట ఎరువులు వేయాలని చెప్పారు. వరుసుగా మూడు సార్లు పచ్చిరొట్ట ఎరువులు వేయడం వల్ల చౌడు పోతుందని చెప్పారు. రైతులకు సరిపడ విత్తనాలు అందించాలన్నారు. చిన్న, సన్నకారు రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఏ నేలకు ఏ పంటలు వేయాలో రైతులకు తెలియజేయాలన్నారు. ప్రతి రైతు భూసార పరీక్ష చేసుకునేలా చూడాలని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రంధి రాము, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నాగభూషణరావు, మండల వ్యవసాయ అధికారి బి.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని

గజపతినగరం: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పిలుపుమేరకు గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, తదిరులు పాల్గొన్నారు.

'స్పెషల్' నిఘా..

- మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల నిఘా..
- ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో విస్తృతంగా తనిఖీలు
- మత్తు వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన



మైదానాల్లో వ్యాయామం చేస్తున్న యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఉమామహేశ్వరరావు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

చీపురుపల్లి: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల తరలింపు, వినియోగాన్ని అడ్డుకునేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసలవ్వకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ ఆస్మా ఫర్హీన్‌సూచనల మేరకు చీపురుపల్లి సర్కిల్ పరిధిలో నిఘా పెంచారు. ఎస్ఈబీ సీఐ ఉమామహేశ్వరరావు నేతృత్వంలో సర్కిల్ పరిధిలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో మాదక ద్రవ్యాలు రవాణా, వినియోగంపై గట్టి నిఘా పెట్టారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలతో పాటు రైళ్లలో ప్రతీరోజూ విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

యువత, విద్యార్థుల్లో అవగాహన

యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలు పాడు చేసుకోవద్దని ఎస్ఈబీ అధికారులు సూచిస్తున్నారు. చీపురుపల్లి ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో కళాశాలలు, వసతిగృహాలు, క్రీడా మైదానాలతో పాటు గ్రంథాలయాలు, యువత అధికంగా ఉండే ప్రదేశాల్లో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ కళాశాల మైదానం, గరివిడి ఎస్‌డీఎస్ అటానమస్ కళాశాల మైదానంలో వ్యాయామం, ఆటలు ఆడుకునే యువత వద్దకు ఎస్ఈబీ అధికారులు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు.

నియంత్రణ కోసం ఫోన్ నంబర్

మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం, తరలింపుపై సమాచారం ఇచ్చేందుకు ప్రభుత్వం ఉచిత ఫోన్‌నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే 14500 నంబర్‌కు ఉచితంగా కాల్ చేసి సమాచారం ఇవ్వవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారు. మాదక ద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఉమామహేశ్వరరావు హెచ్చరిస్తున్నారు.